TGTEL/25/A4812

వాయిస్ ఆఫ్
# వందే భారత్
Voice of Vande Bharath

తెలుగు దినపత్రిక

సంపుటి : 01| సంచిక : 48 | పేజీలు : 04| వెల: రూ.3/- తెలంగాణ శుక్రవారం | మే 29, 2026

# చివరి గింజ వరకూ కొంటాం

- తెలంగాణలో అంచనాను మించి ధాన్యం ఉత్పత్తి
- దేశంలోనే అత్యధికంగా కొనుగోళ్లు చేస్తున్న రాష్ట్రం మనదే..కేంద్రమే చెప్పింది!
- అదనపు ధాన్యపు సేకరణకు రూ.16,479 కోట్లు ఖర్చు చేశాం
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- తడిసిన ధాన్యం సైతం కొని రైతులను ఆదుకున్నాం
- మంత్రుల సంయుక్త మీడియా సమావేశం



2లో..

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** దేశంలోనే అత్యధికంగా ధాన్యం కొనుగోలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని, ఈ విషయాన్ని స్వయంగా కేంద్ర ప్రభుత్వమే స్పష్టం చేసిందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నలమడ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన కొనుగోళ్ల కంటే.. ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలోనే రికార్డు స్థాయిలో సేకరిస్తున్నామని వెల్లడించారు. శుక్రవారం హైదరాబాద్‌లో సహచర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సంయుక్తంగా మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాలను వారు గట్టిగా తిప్పికొట్టారు.మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూనే, వారు చెప్పిన కోటా కంటే అదనంగా ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.16,479 కోట్లు అదనంగా ఖర్చు చేసిందని, రాష్ట్రంలో పండిన చివరి గింజ వరకు కనీస మద్దతు ధర కే కొనుగోలు చేసే పూర్తి బాధ్యత తమ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ధాన్యం సేకరణ ముమ్మరంగా సాగుతోందని, ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యానికి గానూ రూ.11,050 కోట్లను నేరుగా 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో జమ చేశామని మంత్రి వివరించారు. ఈ యాసంగి సీజన్‌లో రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 143 లక్షల టన్నుల ధాన్యం పండితే.. ఇప్పటివరకు రికార్డు స్థాయిలో 73 లక్షల టన్నుల ధాన్యాన్ని విజయవంతంగా సేకరించినట్లు పేర్కొన్నారు. ధాన్యం సత్వర తరలింపు కోసం క్షేత్రస్థాయిలో 13,000 వాహనాలు నిరంతరం పనిచేస్తున్నాయి. కొనుగోలు ప్రక్రియలో దాదాపు 2 లక్షల మంది ప్రభుత్వ సిబ్బంది భాగస్వాములయ్యారు. సేకరణ కేంద్రాలకు కొరత లేకుండా 20.86 కోట్ల గన్నీ బ్యాగులను సరఫరా చేశాం. ధాన్యం మిల్లింగ్ ప్రక్రియ వేగవంతం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా 2,000 మిల్లులు పనిచేస్తున్నాయి.

# శ్రీవాణి టిక్కెట్లలో మార్పులు

**1 గంట లోపు బుక్ చేసుకున్న వారికి 4 గంటలకు దర్శనం**



**తిరుమల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** భక్తుల సౌకర్యార్థం శ్రీవాణి ట్రస్ట్‌కు సంబంధించిన దర్శన టికెట్ల కేటాయింపులో పలు మార్పులు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం టిటిడి తెలిపింది. శ్రీవాణజ టిక్కెట్లు నేరుగా బుక్ చేసుకున్న వారికి అదేరోజు సాయంత్రం దర్శనం కలగనుంది. ఈ టికెట్లు ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు విడుదల చేస్తారని.. మధ్యాహ్నం 1 గంటలోపు బుక్ చేసుకున్న భక్తులకు అదే రోజు సాయంత్రం 4 గంటలకు దర్శనానికి అనుమతించనున్నట్లు పేర్కొంది. కాగా ఈ విధానం జూన్ 10 నుంచి అమలులోకి రానుంది. ఈ కోటాలో బుకింగ్ కాని టికెట్లను తిరిగి కరెంట్ బుకింగ్ కోటాలో ఇస్తామని పేర్కొంది. ఈ విధానం 2027 మార్చి 31 వరకు అమల్లో ఉంటుందని తితిదే వెల్లడించింది. ప్రస్తుతం రోజుకు 1500 శ్రీవాణి టికెట్లను తితిదే ఆన్‌లైన్ ద్వారా అందుబాటులో ఉంచుతోంది. వీటిలో 500 దర్శన టికెట్లను మూడు నెలలు ముందుగానే ఆన్‌లైన్‌లో అడ్వాన్స్ బుకింగ్ కింద అందుబాటులోకి తీసుకొస్తోంది. మరో 200 శ్రీవాణి దర్శన టికెట్లను తిరుపతి విమానాశ్రయంలో కరెంట్ బుకింగ్ కింద జారీ చేస్తోంది. ప్రస్తుతం రోజువారీ కరెంట్ బుకింగ్ కోటాలో అందుబాటులో ఉన్న 800 దర్శన టికెట్లలో ఇప్పటికే రూ.10 వేలు విరాళం చెల్లించి దర్శన టికెట్ కోసం వేచి ఉన్న దాతలకు ప్రతిరోజూ 300 టికెట్లు ప్రత్యేకంగా కేటాయించాలని నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఈ సదుపాయం 2025 మే 1 నుంచి విరాళం చెల్లించిన అర్హులైన దాతలకు వర్తించనుందని తితిదే తెలిపింది.

# యూపీఎస్సీని చూసి నేర్చుకోండి

- 'నీట్' పేపర్ లీక్‌పై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం
- విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళనకు బాధ్యులెవరు..?
- లోపాలకు జవాబుదారీతనం ఉండాల్సిందే!
- జూన్ 21 పరీక్షకు కొత్త యంత్రాంగం..
- ప్రధాని స్వయంగా పర్యవేక్షిస్తున్నారు: సొలిసిటర్ జనరల్



2లో..

# మహనీయుల విగ్రహాల ఏర్పాటులో అడ్డంకులు తొలగించండి

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్
- చివరి నిమిషంలో అభ్యంతరాలు చెప్పొద్దు..
- అధికారులు, పోలీసులు సమన్వయంతో పనిచేయాలి

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్రంలో మహనీయుల విగ్రహాల ప్రతిష్ఠాపనకు సంబంధించి ఎదురవుతున్న సమస్యలను సానుకూలంగా, తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వ విప్, సంబంధిత శాఖామాత్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఉన్నతాధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల పరిధిలో మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు ఎదురవుతున్న ఇబ్బందులు, సాంకేతిక అడ్డంకులపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధ్యక్షతన సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విగ్రహాల ఏర్పాటు ప్రక్రియలో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు మరియు పోలీస్ యంత్రాంగం పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న స్థలాలను ముందుగానే గుర్తించి, సంబంధిత కమిటీలకు నోటీసులు జారీ చేయాలి తప్ప.. విగ్రహాల ప్రతిష్ఠాపన సమయానికి, చివరి నిమిషంలో అభ్యంతరాలు లేవనెత్తి ఉద్రిక్తతలకు తావివ్వకూడదని అధికారులకు స్పష్టం చేశారు. మహనీయుల విగ్రహాల ఏర్పాటు విషయంలో క్షేత్రస్థాయిలో దళిత సంఘాల నాయకులపై అనవసరంగా కేసులు పెట్టవద్దని పోలీసు అధికారులకు మంత్రి



అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గట్టిగా చెప్పారు. ఈ ఉదంతాలలో ప్రజల సామాజిక, సాంస్కృతిక భావోద్వేగాలు ముడిపడి ఉంటాయని, వాటిని ప్రతి ఒక్కరూ గౌరవించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, పోలీస్ కమిషనరేట్లకు చెందిన ఉన్నతాధికారులు, దళిత సంఘాల ముఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం

- జూన్ 2న 'అపాయింటెడ్ డే' ప్రకటించాలి
- 31న రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికుల 'డిమాండ్ డే'..
- జేఏసీ నాయకుల పిలుపు
- విలీనంపై గందరగోళానికి తెరదించాలి



2లో..

## రైతులు పంట వ్యర్థాలను కాల్చవద్దు



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** రైతులు పంట వ్యర్థాలను కాల్చడంతో భూసారానికి హానికలుగుతుందని మం డల వ్యవసాయాధికారి కృష్ణయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వానకాలం సాగుకు భూములను సిద్ధం చేసే క్ర మంలో పంట వ్యర్థాలను కాల్చవద్దని ఆయన రైతులకు విజ్ఞప్తి చేశారు. పంట అవశేషాలను నేలలో కలియదున్నడం వల్ల సేం ద్రియ కార్బన్ పెరిగి భూసారం మెరుగుపడటంతోపాటు ఎరువుల వినియోగం తగ్గి దిగుబడులు పెరుగుతాయన్నారు. అలాగే అచ్చంపేట మండలంలోని రైతులు తమ పంటలు కోతలు పూర్తి కావడంతో అందులో ఉన్న వ్యర్థాలను కాల్చవద్దని అన్న కాల్చడం వల్ల పక్క పొలంలో ఉన్న రైతులకు ఇబ్బంది కలగడం జరుగుతుంది రైతులు మట్టిలో దున్నడంవల్ల భూసారం పెరిగి అధిక దిక్కుబడి వస్తుందని ఒక పట్టణంలో తెలిపారు

## ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం

- **జూన్ 2న 'అపాయింటెడ్ డే' ప్రకటించాలి**
- **31న రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికుల 'డిమాండ్ డే'..**
- **జేఏసీ నాయకుల పిలుపు**
- **ఎర్ర బ్యాడ్జీలతో నిరసనలు..**
- **విలీనంపై గందరగోళానికి తెరదించాలి**

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** టీజీఎస్ ఆర్టీసీని రాష్ట్ర ప్రభుత్వంలో సంపూర్ణంగా విలీనం చేసే ప్రక్రియకు సంబంధించి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2న ముఖ్యమంత్రి అధికారికంగా 'అపాయింటెడ్ డే' ప్రకటించాలని ఆర్టీసీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సింగిల్ డిమాండ్‌ను పురస్కరించుకుని ఈనెల 31న రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని డిపోలు, యూనిట్లలో కార్మికులందరూ ఎర్ర బ్యాడ్జీలు ధరించి 'డిమాండ్ డే' పాటించాలని పిలుపునిచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ కేంద్ర కార్యాలయంలో జేఏసీ నాయకులు అత్యవసర మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ ఛైర్మన్ ఎం. థామస్ రెడ్డి, కో-కన్వీనర్ బి. యాదగిరిలు సంయుక్తంగా మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలోనే ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ విలీన ప్రక్రియకు సంబంధించి శాసనసభలో బిల్లును సైతం ఏకగ్రీవంగా ఆమోదించారని జేఏసీ నేతలు గుర్తుచేశారు. అయితే, కేవలం విలీన తుది తేదీని (Appointed Date) ప్రకటించాల్సిన కీలక సమయంలో రాష్ట్రంలో ప్రభుత్వాలు మారాయని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, ఇటీవల జరిగిన ఆర్టీసీ చర్చల సందర్భంగా మంత్రులతో కూడిన ఉపసంఘం సైతం ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడానికి అధికారికంగా సానుకూల ప్రకటన చేసిందని పేర్కొన్నారు. ప్రభుత్వంలో విలీన ప్రక్రియను పూర్తి చేయకుండా, అంతకంటే ముందే ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ఇటీవల ప్రకటించడంపై జేఏసీ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం వల్ల సాధారణ కార్మికుల్లో తీవ్ర గందరగోళం, అభద్రతాభావం నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ వేడుకల వేదికగా ముఖ్యమంత్రి ఆర్టీసీ విలీన తేదీని స్పష్టంగా ప్రకటించి కార్మికుల ఐదేళ్ల నిరీక్షణకు తెరదించాలి. ప్రభుత్వానికి తమ డిమాండ్ తీవ్రతను తెలియజేసేందుకు మే 31న రాష్ట్రవ్యాప్త నిరసనలు చేపట్టాలి. అన్ని డిపోల పరిధిలో కార్మికులు విధులకు హాజరవుతూనే ఎర్ర బ్యాడ్జీలతో నిరసన తెలపాలి. "ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం అనేది వేలాది మంది కార్మిక కుటుంబాల జీవితాలతో ముడిపడి ఉన్న అంశం. ప్రభుత్వం తక్షణమే స్పందించి జూన్ 2 లోగా స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేయాలి. లేనిపక్షంలో కార్మికుల పక్షాన జేఏసీ ఆధ్వర్యంలో ఉమ్మడి కార్యాచరణతో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం." అని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో ఎంప్లాయీస్ యూనియన్ రీజినల్ సెక్రటరీలు, వివిధ డిపోల జేఏసీ ప్రతినిధులు మరియు ఆర్టీసీ కార్మిక నేతలు పాల్గొన్నారు.

# చివరి గింజ వరకూ కొంటాం

- **తెలంగాణలో అంచనాను మించి ధాన్యం ఉత్పత్తి**
- **దేశంలోనే అత్యధికంగా కొనుగోళ్లు చేస్తున్న రాష్ట్రం మనదే..కేంద్రమే చెప్పింది!**
- **అదనపు ధాన్యపు సేకరణకు రూ.16,479 కోట్లు ఖర్చు చేశాం**
- **మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**
- **తడిసిన ధాన్యం సైతం కొని రైతులను ఆదుకున్నాం**
- **మంత్రుల సంయుక్త మీడియా సమావేశం**

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** దేశంలోనే అత్యధికంగా ధాన్యం కొనుగోలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని, ఈ విషయాన్ని స్వయంగా కేంద్ర ప్రభుత్వమే స్పష్టం చేసిందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నలమడ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన కొనుగోళ్ల కంటే.. ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలోనే రికార్డు స్థాయిలో సేకరిస్తున్నామని వెల్లడించారు. శుక్రవారం హైదరాబాద్‌లో సహచర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సంయుక్తంగా మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాలను వారు గట్టిగా తిప్పికొట్టారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూనే, వారు చెప్పిన కోటా కంటే అదనంగా ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.16,479 కోట్లు అదనంగా ఖర్చు చేసిందని, రాష్ట్రంలో పండిన చివరి గింజ వరకు కనీస మద్దతు ధర కే కొనుగోలు చేసే పూర్తి బాధ్యత తమ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ధాన్యం సేకరణ ముమ్మరంగా సాగుతోందని, ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యానికి గానూ రూ.11,050 కోట్లను నేరుగా 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో జమ చేశామని మంత్రి వివరించారు. ఈ యాసంగి సీజన్‌లో రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 143 లక్షల టన్నుల ధాన్యం పండితే.. ఇప్పటివరకు రికార్డు స్థాయిలో 73 లక్షల టన్నుల ధాన్యాన్ని విజయవంతంగా సేకరించినట్లు పేర్కొన్నారు. ధాన్యం సత్వర తరలింపు కోసం క్షేత్రస్థాయిలో 13,000 వాహనాలు నిరంతరం పనిచేస్తున్నాయి. కొనుగోలు ప్రక్రియలో దాదాపు 2 లక్షల మంది ప్రభుత్వ సిబ్బంది భాగస్వాములయ్యారు. సేకరణ కేంద్రాలకు కొరత లేకుండా 20.86 కోట్ల గన్నీ బ్యాగులను సరఫరా చేశాం. ధాన్యం మిల్లింగ్ ప్రక్రియ వేగవంతం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా 2,000 మిల్లులు పనిచేస్తున్నాయి.

### తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేశాం..

ఇటీవల కురిసిన అకాల వర్షాలకు రైతులు నష్టపోకుండా చూశామని, వర్షానికి తడిసిన 10,214 టన్నుల ధాన్యాన్ని సైతం ప్రభుత్వం కొనుగోలు చేసి అన్నదాతలను ఆదుకుందని మంత్రి తెలిపారు. హమాలీల కొరత ఉన్న మాట వాస్తవమేనని, ఇందుకు బీహార్, బెంగాల్ కార్మికులపై ఆధారపడాల్సి వస్తోందని.. బెంగాల్ ఎన్నికల కారణంగా వారు స్వస్థలాలకు వెళ్లి రావడం కొద్దిగా ఆలస్యమైనప్పటికీ, ఎక్కడా కొనుగోళ్లకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో కేవలం 24 లక్షల టన్నులే కొనుగోలు చేస్తే.. తెలంగాణలో ఇప్పటికే 73 లక్షల టన్నులు దాటిందని పోల్చి చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో ధాన్యం మద్దతు ధరల కోసం ఏడాదికి సగటున రూ.15,000 కోట్లు వెచ్చిస్తే.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రూ.49,000 కోట్లు కేటాయించిందని, గత రెండున్నరేళ్లలో రూ.36,000 కోట్లు రైతుల ఖాతాల్లో వేశామని మంత్రులు స్పష్టం చేశారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కొనుగోలు కేంద్రాల్లో చివరి గింజ తరలిపోయే వరకు కేంద్రాలు పనిచేస్తూనే ఉంటాయని భరోసా ఇచ్చారు.

**బీజేపీ నేతలు ఢిల్లీకి వెళ్లి ధర్నా చేయాలి..**

"యాసంగిలో రాష్ట్ర ప్రభుత్వం 73 లక్షల టన్నులు కొనుగోలు చేస్తుంటే.. కేంద్ర ప్రభుత్వం మాత్రం కేవలం 5 లక్షల టన్నులే కొంటామని చెబుతోంది. ఏటా తెలంగాణ కోటాను కేంద్రం తగ్గిస్తోంది. సీఎం రేవంత్ రెడ్డితో కలిసి మేము స్వయంగా ఢిల్లీకి వెళ్లి కోరguide చేసినా పట్టించుకోలేదు. ఇక్కడి బీజేపీ నేతలు రాష్ట్రంలో ధర్నాలు చేయడం కాదు.. ఢిల్లీకి వెళ్లి కేంద్రంపై ఒత్తిడి తెచ్చి వడ్లు కొనేలా చేయాలి"

మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్

# యూపీఎస్సీని చూసి నేర్చుకోండి

- **నీట్' పేపర్ లీక్‌పై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం**
- **విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళనకు బాధ్యులెవరు..?**
- **లోపాలకు జవాబుదారీతనం ఉండాల్సిందే!**
- **జూన్ 21 పరీక్షకు కొత్త యంత్రాంగం..**
- **ప్రధాని స్వయంగా పర్యవేక్షిస్తున్నారు: సొలిసిటర్ జనరల్**

**న్యూఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన 'నీట్-యూజీ' పరీక్ష పేపర్ లీక్ వివాదంపై సుప్రీంకోర్టు మరోసారి తీవ్ర ఆందోళన, ఆగ్రహం వ్యక్తం చేసింది. పటిష్టమైన పర్యవేక్షణా యంత్రాంగాలు, ఉన్నత స్థాయి కమిటీలు ఉన్నప్పటికీ ఇంత పెద్ద భద్రతా ఉల్లంఘన ఎలా జరిగిందని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ, కేంద్ర ప్రభుత్వాన్ని గట్టిగా ప్రశ్నించింది. ఇటువంటి సంఘటనలు లక్షలాది మంది విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు తీవ్ర మానసిక క్షోభను కలిగిస్తాయని, వారి నమ్మకాన్ని ఇలా వమ్ము చేయడం సరికాదని అభిప్రాయపడింది. పేపర్ లీక్ వ్యవహారంలో లోపాలకు కచ్చితమైన జవాబుదారీతనం ఉండాల్సిందేనని, అప్పుడే అసలు సమస్యకు పరిష్కారం లభిస్తుందని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ కేసు తదుపరి విచారణను సర్వోన్నత న్యాయస్థానం జూలై రెండో వారానికి వాయిదా వేస్తూ, ఈ లోగా సమగ్ర ప్రతిస్పందనతో అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణ సందర్భంగా జస్టిస్ నరసింహ నేతృత్వంలోని సుప్రీం ధర్మాసనం ఎన్‌టీఏ పనితీరుపై పలు పదునైన ప్రశ్నలు సంధించింది. "కేంద్ర ప్రభుత్వ పరిధిలోని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే పరీక్షల్లో ఇలాంటి ఉదంతాలు ఎప్పుడూ వెలుగుచూడలేదు. ఎన్‌టీఏ అంతటి ప్రతిష్టాత్మక సంస్థ యూపీఎస్సీని చూసి నిబంధనలు, పారదర్శకత నేర్చుకోవాలి" అని సర్వోన్నత న్యాయస్థానం హితవు పలికింది. ఈ విచారణకు నీట్ పరీక్షా వ్యవస్థ ప్రక్షాళన కోసం కేంద్రం ఏర్పాటు చేసిన హైలెవెల్ కమిటీ చైర్మన్, ఇస్రో మాజీ చీఫ్ డా.కె.రాధాకృష్ణన్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్‌టీఏ, డా.రాధాకృష్ణన్ దాఖలు చేసిన అఫిడవిట్‌లను న్యాయస్థానం నిశితంగా పరిశీలించింది. గతంలో అనేక రక్షణ వలయాలు ఉన్నప్పటికీ పేపర్ ఎలా లీకైందని, అందుకు దారితీసిన పరిస్థితులు ఏంటని న్యాయమూర్తి ప్రశ్నించగా.. డా. రాధాకృష్ణన్ కోర్టుకు వివరణ ఇచ్చారు. ప్రాథమికంగా పేపర్ సెట్టింగ్ ప్రక్రియలో కొన్ని సాంకేతిక, పర్యవేక్షణ లోపాలు ఉన్నాయని ఆయన అంగీకరించారు. ప్రస్తుతం ఆ లోపాలను సరిదిద్ది వ్యవస్థను మరింత బలోపేతం చేశామన్నారు. పరీక్షల సజావుగా నిర్వహణ కోసం తాము మొత్తం 101 సూచనలు చేశామని, అందులో 60 తాత్కాలిక సూచనలను 2025-26 పరీక్షల కోసం ప్రత్యేకంగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. భవిష్యత్తులో లీకేజీలకు తావుండదు: మిగిలిన మార్గదర్శకాలు కూడా త్వరలోనే పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తాయని, భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాబోవని ధీమా వ్యక్తం చేశారు. సంస్కరణలే తమ కమిటీ అంతిమ లక్ష్యమని పేర్కొన్నారు.

**"కేవలం సంస్కరణలు, నిబంధనలు మార్చినంత మాత్రాన పరిస్థితి చక్కబడదు. తప్పు జరిగినప్పుడు దానికి బాధ్యత ఎవరిదనే దానిపై స్పష్టత ఉండాలి. బాధ్యులను తేల్చకుండా ఎన్ని కమిటీలు వేసినా, ఎన్ని మీటింగ్‌లు పెట్టినా ఎలాంటి ఫలితం ఉండదు."**

**- సుప్రీంకోర్టు ధర్మాసనం**

ఈ భద్రతా లోపాలపై దర్యాప్తు వేగంగా సాగుతోందని కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ధర్మాసనానికి తెలియజేశారు. దేశ యువత ఆందోళనలను, భవిష్యత్తును ప్రభుత్వం అత్యంత సీరియస్‌గా తీసుకుందని.. స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ అంశాన్ని వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నారని కోర్టుకు వివరించారు. రాబోయే జూన్ 21 నాటి నీట్-యూజీ పరీక్ష నిర్వహణ కోసం ఎలాంటి లోపాలు లేని సరికొత్త హైటెక్ వ్యవస్థలను, కఠినమైన నిఘా యంత్రాంగాన్ని ఏర్పాటు చేసినట్లు సొలిసిటర్ జనరల్ సర్వోన్నత న్యాయస్థానానికి స్పష్టం చేశారు.

వాయిస్ ఆఫ్ వందే భారత్
Voice of Vande Bharath
VOICE OF VANDE BHARATH
శుక్రవారం, మే 29, 2026

# మధురానగర్ కాలనీలో జలదిగ్బంధం

- అధికారుల నిర్లక్ష్యంపై గువ్వల బాలరాజు ఆగ్రహం
- స్విమ్మింగ్ పూల్‌ను తలపిస్తున్న నివాస ప్రాంతాలు..
- ఇళ్లకే పరిమితమైన కాలనీవాసులు
- మున్సిపల్ కమిషనర్ వైఫల్యమే కారణం..
- తక్షణమే శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** పట్టణంలోని మధురానగర్ కాలనీలో నిన్న రాత్రి కురిసిన అకాల భారీ వర్షానికి నివాస ప్రాంతాలు జలమయమయ్యాయి. కాలనీ మధ్యలో భారీగా వర్షపు నీరు నిల్వ ఉండి స్విమ్మింగ్ పూల్‌ను తలపించే పరిస్థితి ఏర్పడింది. దీంతో కాలనీవాసులు ఇళ్ల నుండి బయటకు రాలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని ఇండ్లకు వెళ్లే దారులు పూర్తిగా నీట మునిగిపోవడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. విషయం తెలుసుకున్న అచ్చంపేట మాజీ శాసనసభ్యులు, బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ గువ్వల బాలరాజు శుక్రవారం కాలనీలో ముమ్మరంగా పర్యటించారు. నీట మునిగిన రోడ్లను, ఇళ్లను పరిశీలించి కాలనీవాసులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాజీ ఎమ్మెల్యే ఎదుట తమ ఆవేదనను వ్యక్తపరిచారు. మున్సిపల్ కమిషనర్ తీవ్ర నిర్లక్ష్యం కారణంగానే కాలనీలో సరైన డ్రైనేజీ వ్యవస్థను నిర్మించలేదని, రోడ్ల అభివృద్ధిని పూర్తిగా గాలికొదిలేశారని మండిపడ్డారు. వర్షం వచ్చిన ప్రతిసారీ ఇళ్లలోకి నీరు చేరుతోందని వాపోయారు. బాధితుల సమస్యలపై డా.గువ్వల బాలరాజు తక్షణమే స్పందిస్తూ, అక్కడి నుంచే సంబంధిత ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడారు. కాలనీలో నిలిచిన నీటిని యుద్ధప్రతిపాదికన తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. “పట్టణంలోని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనలో మున్సిపల్ యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. మధురానగర్ కాలనీ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన డ్రైనేజీ, సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులను తక్షణమే చేపట్టాలి. అధికారులు మొద్దునిద్ర వీడి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి, లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో మున్సిపల్ ఆఫీస్ ముట్టడికి వెనుకాడం.” అని మాజీ శాసనసభ్యులు డాక్టర్ గువ్వల బాలరాజు హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ అచ్చంపేట పట్టణ అధ్యక్షులు గండు శ్రీనివాస్ గౌడ్, ప్రముఖ నాయకులు శంకర్ మాదిగ, చందులాల్ చౌహాన్, శివచంద్ర, రేనయ్య, రాకేష్, ఆంజనేయులు, బయ్యరాజు, గోలి రేనయ్య, కాలనీ వాసులు పాల్గొన్నారు..

# ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను నిర్వహించండి

**కలెక్టర్ గరిమా అగర్వాల్**



**రాజన్న సిరిసిల్ల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో జూన్ 2న నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను అత్యంత ప్రతిష్టాత్మకంగా, ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల ముందస్తు ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే, ఉమ్మడి జిల్లాల అధికారులతో కలిసి శుక్రవారం కలెక్టరేట్ ముఖద్వార సమీకృత సమావేశ మందిరంలో కలెక్టర్ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమా అగర్వాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర అవతరణ దినోత్సవ ప్రధాన వేడుకలు జిల్లా కేంద్రంలోని పరేడ్ గ్రౌండ్‌లో జరుగుతాయని వెల్లడించారు. ఈ వేడుకలకు జిల్లాలోని ప్రతి శాఖకు చెందిన ప్రభుత్వ అధికారులు, సిబ్బంది ఎట్టి పరిస్థితుల్లోనూ విధిగా హాజరు కావాలని స్పష్టం చేశారు. వేడుకలకు సంబంధించి జాతీయ జెండా ఆవిష్కరణ ఏర్పాట్లు, పరేడ్ మైదానాన్ని సిద్ధం చేయడం వంటి పనులను పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పర్యవేక్షించి సకాలంలో పూర్తి చేయాలి. ప్రధాన డయాస్ రూపకల్పన, విఐపీలు, సందర్శకుల సీటింగ్ అమరికను పకడ్బందీగా చేపట్టాలి. ఆసనాల ఏర్పాటులో ప్రోటోకాల్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలి. వేడుకల ప్రాంగణంలో అత్యవసర సేవల కోసం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య బృందాలతో కూడిన శిబిరాలు ఏర్పాటు చేయాలి. ఆహ్వాన పత్రాలను ప్రోటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులు, ప్రముఖులకు సకాలంలో అందజేయాలి. మహిళా సంఘాల భాగస్వామ్యం: సిరిసిల్ల పట్టణంలోని స్వశక్తి మహిళా సంఘాల ప్రతినిధులు, మహిళలు ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో భాగస్వాములు అయ్యేలా మెప్మా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. వేడుకల్లో ముఖ్య అతిథి చదివి వినిపించే అధికారిక సందేశం కోసం జిల్లాలో ప్రభుత్వం చేపట్టిన వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను క్లుప్తంగా, సమగ్రంగా క్రోడీకరించి నివేదిక తయారు చేయాలి. ఈ సమగ్ర సమీక్షా సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, కలెక్టరేట్ పరిపాలనాధికారి రామ్‌రెడ్డి, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, పోలీస్ నూతన సబ్ డివిజన్ అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# బాలింతలకు అవగాహన

**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** పట్టణంలోని పదవ అంగన్వాడి సెంటర్ లో 99వ రోజు ప్రణాళికలో భాగంగా బాలింతలకు, గర్భిణీ స్త్రీలకు అంగన్వాడి టీచర్ సంధ్య అవగాహన కల్పించారు. మొదటి 1000 రోజులు బిడ్డ జీవితానికి బలమైన పునాది గర్భధారణ ప్రారంభం నుండి రెండు సంవత్సరాల వరకు ఉన్న కాలమే మొదటి 1000 రోజులు. పోషకాహారం తీసుకోవాలి ఐరన్ పోలికస్మాత్రాలు తీసుకోవాలి తల్లికి విశ్రాంతి అవసరం క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి. తల్లిపాలు బిడ్డకు పూర్తి పోషకాలు లభిస్తాయి రోగ నిరోధక శక్తి పెంచుతాయి సులభంగా జీర్ణమవుతాయి తల్లికి బిడ్డకు మధ్య అనుబంధం పెంచుతుంది గంటల్లోపు పాలు బిడ్డకు చాలా ముఖ్యమైనది అదే విధంగా ఆరు నెలలు వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి ఆరు నెలలు దాటిన తర్వాత అదనపు ఆహారము తల్లిపాలతో పాటు రెండు సంవత్సరాల వరకు ఇవ్వాలి. బిడ్డ యొక్క కదలికలు గమనిస్తూ ఉండాలి వారి



యొక్క అభివృద్ధిని గమనిస్తూ ఉండాలి . ఈ విధంగా బిడ్డకు సరైన పోషణ ప్రేమ సంరక్షణ కలిగించడం వలన బిడ్డకు ఆరోగ్యవంతమైన భవిష్యత్తు ఇవ్వగలుగుతాము. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు సుగుణ, చంద్రకళ, రమ, చిన్నారులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి గింజను కొనుగోలు చేస్తాం



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రైతులు పండించిన ప్రతి గింజలు కొనుగోలు చేసి వ్యవసాయ మార్కెట్ నుండి తరలించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఆర్డిఓ యాదగిరి, తహసీల్దార్ సైదులు అన్నారు. శుక్రవారం పట్టణంలో వ్యవసాయ మార్కెట్ యార్డులో వారు రైతులు తెచ్చిన ధాన్యాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ రైతులు తెచ్చిన మక్కలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గింజలు కొనే వరకు చర్యలు తీసుకుంటుందని సూచించారు వ్యవసాయ మార్కెట్లో నిలువచేసిన మక్కలను వర్షం నుండి కాపాడడానికి ముందస్తుగా తగు చర్యలు తీసుకున్నామని వారు సూచించారు. ముఖ్యంగా వర్షం నుండి మార్కెట్లో నిర్వహించిన ధాన్యం తడవకుండా ప్రధాన గేటు వద్ద టిప్పర్లతో మొరం పోసి మార్కెట్ యార్డ్ లో ఉన్న మక్క గింజలను వర్షపు నీటి నుండి కాపాడమని పేర్కొన్నారు. మక్కలను తరలించడానికి 80 ట్రాక్టర్లను ఏర్పాటు చేశామని రెండు మూడు రోజుల్లో మార్కెట్లో ఉన్న మక్కలను పూర్తిస్థాయిలో తరలించేందుకు చర్యలు చేపట్టామన్నారు. రైతులు ఎటువంటి ఆందోళన చెందే అవసరము లేదని సూచించారు.కొనుగోలు చేసిన మక్కలను నిలువ చేయడానికి కాటన్ మిల్లులు, ఇతరత్రా ప్రవేటు బిల్డింగ్లను లీస్ కు తీసుకోవడం జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది,అంజి,తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి పొంగులేటిని కలిసిన నల్లమల జర్నలిస్టులు

- అక్రిడేషన్లు, బస్ పాస్ సమస్యలపై వినతి
- సమస్యల పరిష్కారానికి మంత్రి సానుకూల స్పందన

**హైదరాబాద్/అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** నల్లమల ప్రాంత జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు దీర్ఘకాలిక సమస్యలను రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి ప్రతినిధుల బృందం తీసుకెళ్లింది. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సూచన మేరకు శుక్రవారం హైదరాబాద్ సచివాలయంలోని మంత్రి చాంబర్‌లో జర్నలిస్టులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అందించిన సిఫారసు లేఖను మంత్రికి అందజేసి, స్థానిక విలేకరుల ఇబ్బందులను వివరించారు. నల్లమల ప్రాంత జర్నలిస్టులకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు హైదరాబాద్ వరకు ఉచిత బస్సు పాస్ సౌకర్యాన్ని విస్తరించాలి. అమ్రాబాద్ మండలంలోని మన్ననూర్, బ్రహ్మగిరి కేంద్రాలకు అక్రిడేషన్ కార్డుల పునరుద్ధరణ కోసం ఆన్‌లైన్ సెంటర్లను తక్షణమే ఏర్పాటు చేయాలి. నియోజకవర్గ కేంద్రాల్లో గత కాలం నుండి కొనసాగుతున్న ఆర్‌సీ ఇన్‌చార్జి అక్రిడేషన్ కార్డులను యథావిధిగా కొనసాగించాలి. మన్ననూర్ ఐటీడీఏ కేంద్రానికి ప్రభుత్వం గతంలో జారీ చేసిన జీవో ప్రకారం అక్రిడేషన్లు మంజూరు చేయడంతో పాటు, పత్రికల సర్క్యులేషన్‌కు సంబంధించిన 2.50 లక్షల నిబంధనను సడలించాలి. జర్నలిస్టుల వినతులపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. నల్లమల లాంటి వెనుకబడిన ప్రాంతాల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యలను ప్రత్యేకంగా పరిశీలిస్తామని, సమాచార శాఖ ఉన్నతాధికారులతో చర్చించి త్వరలోనే తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రితో భేటీ అనంతరం జర్నలిస్టు ప్రతినిధుల బృందం సమాచార, పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్ జగన్‌ను కలిసి క్షేత్రస్థాయి సమస్యలను వివరించింది. దీనిపై జేడీ సానుకూలంగా స్పందిస్తూ.. మన్ననూర్, బ్రహ్మగిరి



కేంద్రాలకు సంబంధించిన అక్రిడేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ ఇప్పటికే పూర్తయిందని, శనివారం లోగా వీటిని ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. అక్రిడేషన్ కార్డుల పునరుద్ధరణకు తక్షణమే సహకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి, జర్నలిస్టు సంఘాల నాయకత్వానికి నల్లమల జర్నలిస్టులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తమ సమస్యల పరిష్కారానికి అండగా నిలిచి, సిఫారసు లేఖ అందించిన అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు సంఘం రాష్ట్ర నాయకులు చందు నాయక్, నల్లమల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొండయ్య, ప్రతినిధులు ప్రకాష్, లక్ష్మీపతి, బాలస్వామి, కర్నాటి శ్రీనివాసులు, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## మత్తడి దుంకుతున్న వెల్టూరు చెరువు

- పసుపు, కుంకుమలతో సర్పంచ్ అభిషేకం
- అకాల వర్షంతో నిండిన జలాశయం..



**ఉప్పునుంతల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మండల పరిధిలోని వెల్టూర్ గ్రామంలో గురువారం రాత్రి కురిసిన అకాల భారీ వర్షానికి స్థానిక పెద్ద చెరువు పూర్తిగా నిండి నిబిడీకృతమై పరవళ్లు తొక్కుతోంది. చెరువు అలుగు పోస్తూ మత్తడి దుంకుతుండటంతో గ్రామ ప్రజలు, ముఖ్యంగా రైతాంగంలో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం గ్రామ సర్పంచ్ చింతోజు వెంకటేష్ ఆధ్వర్యంలో గ్రామస్థులు, రైతులు కలిసి చెరువు వద్దకు చేరుకుని సాంప్రదాయబద్ధంగా పసుపు, కుంకుమలు సమర్పించి ప్రత్యేక అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చింతోజు వెంకటేష్ మాట్లాడుతూ.. చెరువులు నిండి మత్తడి దుంకడం గ్రామాభివృద్ధికి, వ్యవసాయ ప్రగతికి శుభసూచకమని హర్షం వ్యక్తం చేశారు. ఈ ఏడాది గ్రామ రైతులందరికీ పాడి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రతి రైతు కుటుంబం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆ గంగమ్మ తల్లిని ప్రార్థించినట్లు తెలిపారు. "భూగర్భ జలాలు పెరగడానికి, వ్యవసాయానికి చెరువులే ప్రధాన ఆధారం. గ్రామ ప్రజలందరి సహకారంతో మన నీటి వనరులను, కాలువలను కాపాడుకోవాలి. వర్షపు నీటిని వృథా కాకుండా నిల్వ చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో సాగు, తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవచ్చు." అని వెల్టూర్ గ్రామ సర్పంచ్ చింతోజు వెంకటేష్ అన్నారు. ఈ జలధారల ఉత్సవ పూజా కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు సుంకరి మౌనిక నాగరాజు, భూరం నరేష్, గ్రామ సీనియర్ రైతులు భూసిరాజు జంగయ్య, గొర్రె రాజు, భాస్కర్, శ్రీను, ఉప్పరి బాలరాజు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అచ్చంపేట మార్కెట్‌లో దళారుల రాజ్యమేలుతోంది

- బీఆర్ఎస్ నేత పోకల మనోహర్
- రాత్రి కురిసిన వర్షానికి తడిసిన ధాన్యం..
- క్షేత్రస్థాయిలో పరిశీలన
- అకాల వర్షంతో అన్నదాతల కన్నీరు..
- వెంటనే కొనుగోలు చేయాలని తహసీల్దార్‌కు వినతి



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో దళారు వ్యవస్థ విచ్చలవిడిగా పెరిగిపోయిందని, వ్యాపారులు కుమ్మక్కై రైతులను నిలువునా మోసం చేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు పోకల మనోహర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం రాత్రి కురిసిన అకాల వర్షానికి మార్కెట్ యార్డ్‌లో ఓపెన్ ప్లాట్‌ఫారాలపై ఉన్న ధాన్యం పెద్ద ఎత్తున తడిసి ముద్దయింది. శుక్రవారం ఉదయం బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో కలిసి ఆయన మార్కెట్ యార్డ్‌ను సందర్శించి, తడిసిన ధాన్యపు కుప్పలను పరిశీలించి బాధితులైన రైతులతో మాట్లాడారు. అనంతరం మార్కెట్‌లోని ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ అచ్చంపేట మండల తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పోకల మనోహర్ మాట్లాడుతూ.. అధికారంలోకి రాకముందు రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని, ప్రతి గింజనూ కొంటామని ఆకాశమంత హామీలిచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, నేడు అధికారంలోకి వచ్చాక అన్నదాతలను నట్టేట ముంచి అనేక ఇబ్బందులకు గురిచేస్తోందని మండిపడ్డారు. అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌కు రైతులు ధాన్యం తీసుకొచ్చి 20 రోజులు గడుస్తున్నా.. నేటికీ కొనుగోలు చేయకపోవడం దుర్మార్గమైన చర్య అని మనోహర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉదాసీనత, అధికారుల నిర్లక్ష్యం వల్లే నేడు అకాల వర్షానికి రైతుల కష్టమంతా నీటిపాలైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, మార్కెటింగ్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి మార్కెట్ యార్డులో ఉన్న సాధారణ ధాన్యంతో పాటు, వర్షానికి తడిసిన ధాన్యాన్ని కూడా ఎలాంటి కోతలు లేకుండా మద్దతు ధరకు వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. "రైతులకు తక్షణమే న్యాయం చేయకుంటే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతాంగాన్ని ఏకం చేసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతాం. తడిసిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేసే వరకు మా పోరాటం ఆగదు." అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పోకల మనోహర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అమీనోద్దీన్, మున్సిపల్ మాజీ చైర్మన్ తులసిరామ్, మండల పార్టీ అధ్యక్షులు పర్వతాలు, మాజీ కౌన్సిలర్ రమేష్ రావు, ముఖ్య నాయకులు బెల్లి బాలరాజు, సుల్తాన్, రాజేష్, సోషల్ మీడియా ఇన్‌ఛార్జ్ పిల్లి బాలరాజు, పార్టీ శ్రేణులు, బాధిత రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## బోగస్ ఓట్లను తొలగించేందుకు కార్యకర్తలు శ్రమించాలి

- బీజేపీ జిల్లా కార్యదర్శి సురేంద్ర రావు
- 'సర్' ప్రోగ్రాంపై అవగాహన సదస్సు

**వేములవాడ రూరల్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్రంలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ వేములవాడ రూరల్ మండల బీజేపీ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్యాలయం ఎదుట బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ ముట్టడి కార్యక్రమాన్ని ఉద్దేశించి బీజేపీ రూరల్ మండల అధ్యక్షులు బూరుగుపల్లి పరమేష్ మాట్లాడుతూ.. ఐలాపూర్, వత్తెంల తదితర గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు విషయమై తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించి పది రోజులు గడుస్తున్నా యంత్రాంగం ఇంతవరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం అత్యంత బాధాకరమన్నారు. ప్రస్తుతం జిల్లాలో అకాల వర్షాలు కురిసే సూచనలు ఉన్నందున, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల వేళ ఇచ్చిన హామీల మేరకు ఐప్యాక్ కొనుగోలు కేంద్రాల్లోని పూర్తి ధాన్యాన్ని ఎలాంటి కోతలు లేకుండా వెంటనే సేకరించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అన్నదాతల పక్షాన బీజేపీ ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అంతకుముందు, కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రోగ్రాంపై వేములవాడ రూరల్ బీజేపీ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలకు, బూత్ స్థాయి ఏజెంట్లకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజన్న సిరిసిల్ల బీజేపీ జిల్లా కార్యదర్శి గోపాటి సురేంద్ర రావు విచ్చేసి దిశా నిర్దేశం చేశారు.



ఈ సందర్భంగా సురేంద్ర రావు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు హక్కు అత్యంత కీలకమైందని, ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న డూప్లికేట్, బోగస్ ఓట్లను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటిని ఓటరు జాబితా నుండి తొలగించేలా బూత్ అధ్యక్షులు, బీఎల్ఏ–2లు. ప్రతి ఒక్క బీజేపీ కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. "కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సాగుతున్న ఈ ఓటరు నమోదు, సవరణ ప్రక్రియను ప్రతి కార్యకర్త సద్వినియోగం చేసుకోవాలి. అర్హులైన కొత్త ఓటర్ల నమోదుకు సహకరిస్తూనే, అక్రమ ఓట్లపై నియోజకవర్గ కమిటీకి నివేదించాలి." అని బీజేపీ జిల్లా కార్యదర్శి గోపాటి సురేంద్ర రావు సూచించారు. ఈ ముట్టడి, అవగాహన సదస్సు కార్యక్రమాల్లో వివిధ గ్రామాల సర్పంచులు జంకె మధు, సందేసరి సౌజన్య మల్లికార్జున్, మండల ప్రధాన కార్యదర్శి వనపర్తి పరశురాములు, మండల ఉపాధ్యక్షులు లింగంపల్లి కుంటయ్య, నల్ల వెంకటరెడ్డి, సీనియర్ నాయకులు లింగంపల్లి కిషోర్, జంగం వంశీ, సామోజి గౌతమ్, కొత్తపల్లి గంగాధర్, సారా నర్సయ్య, లింగంపల్లి రాజు, లింగంపల్లి రవీందర్, నేదురి లక్ష్మణ్ తదితర బీజేపీ నాయకులు, శక్తి కేంద్రాల ఇన్‌ఛార్జులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## చిన్నారుల సమగ్ర ఎదుగుదలకు అంగన్‌వాడీలు కీలకం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్:** చిన్నారుల ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు, వారి ప్రాథమిక విద్యాభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతగానో కృషి చేస్తున్నాయని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా సంక్షేమ వారోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. శుక్రవారం వేములవాడ పట్టణ పరిధిలోని శత్రాజ్‌పల్లిలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళికతో ముందుకు సాగుతోందన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల లక్ష్యాలను నిర్దేశించుకుని, ప్రతి వారం ఒక్కో ప్రభుత్వ శాఖ ఆధ్వర్యంలో గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు విస్తృతంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పసిపిల్లల్లో పోషకాహార లోపాలను నివారించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని విప్ తెలిపారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్: రాష్ట్రంలో విద్యా విధానాన్ని బలోపేతం చేసేందుకు వేములవాడ నియోజకవర్గానికి 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్' మంజూరైందని, దీనిని రూ.200 కోట్ల వ్యయంతో 20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్నట్లు ప్రకటించారు. ఇక్కడ విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఉచిత విద్య, నాణ్యమైన భోజనం అందిస్తామన్నారు. నియోజకవర్గానికి ఒకటి



చొప్పున ప్రతిష్టాత్మక 'తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు' రానున్నాయని, ఒక్కో పాఠశాలలో 1500 మంది విద్యార్థులు చదువుకునేలా మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. విద్యార్థుల మెస్, కాస్మోటిక్, డైట్ చార్జీలను ఇప్పటికే పెంచినట్లు గుర్తుచేశారు. రైతు సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్న ఆది శ్రీనివాస్.. జగిత్యాల జిల్లా పొలాస పరిశోధనా కేంద్రం తరహాలోనే వేములవాడ నియోజకవర్గ పరిధిలోని మర్రిపల్లి గ్రామంలో 40 ఎకరాల విస్తీర్ణంలో నూతనంగా 'రైతు విజ్ఞాన కేంద్రాన్ని' ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. దీని ద్వారా రైతులకు ఆధునిక వ్యవసాయ విధానాలపై, నూతన వంగడాల సాగుపై శాస్త్రవేత్తలతో అవగాహన కల్పించి ప్రోత్సహిస్తామన్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అదనంగా 36 వేల బెడ్స్ అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు. శత్రాజ్‌పల్లిలో ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి పనులను యుద్ధప్రతిపాదికన పూర్తి చేయించి, అతి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ఐసిడిఎస్ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయా గ్రామాల మహిళలు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.